
# మంచితనానికా శిక్ష?




నేను ఎక్కవలిసిన రైలు ఒక జీవితకాలం పాటు లేటు కాకపోయినా, రెండు గంటలు లేటుగా వచ్చి, కడప ప్లాట్‌ఫారమ్‌మీద పోజుగా నిలిచింది. రెండు సార్లు కిందికి, మీదికి తిరిగి, తీరా రైలు కదిలేటప్పటికి, లాభం లేదనుకుని కాళ్ల దగ్గరున్న కంపార్ట్‌మెంట్‌లో దూరాను. తిరుపతిలో గంగమ్మ జాతర కంటే, ఫస్ట్‌డే రిలీజ్ అయిన పిక్చరు హాలు ముందుకంటే జనం క్రిక్కిరిసి ఉన్నారు. తలుపు దగ్గరున్న జనం లోనివాళ్లను తోస్తున్నారు. లోని వాళ్లనుంచి తోపిడి ప్రారంభం అయితే అది ఫుట్ బోర్డుమీదున్న నన్ను కిందికి తోసేదాకా ఆగదు. కొందరేమో కూర్చునేచోట నిద్ర పోతున్నారు. లేపటానికి ప్రయత్నించేవాళ్ల కొందరికి వాళ్ల అరవం, హిందీ, మలయాళము అర్థం కావటం లేదు. నిద్రపోయేవాళ్ల తీరూ తెన్నూ చూస్తే, రెండు రోజులుగా కంపార్ట్‌మెంట్‌లో కాపుర మున్నట్లున్నారు. అంటే రైలు బయలుదేరిన బొంబాయి నుంచి వస్తున్నట్లున్నారు.

మెల్లగా సందు చేసుకుని కొద్ది దూరం లోనికి వచ్చాను, ఎందరి కాళ్లో తొక్కి, ఎన్నో తిట్లు తిని. ఒక లావుపాటాయన బుర్రమీసాలతో, మోచేతి కిందివరకు ఉన్న చేతుల చొక్కాతో నేను నిలుచున్న పక్క బల్లమీద కూర్చుని ఉన్నాడు. రెండు సీట్ల మనిషి. కానీ టికెట్టేమో ఒకటే! ఎక్కడి న్యాయం? అతను సన్నటివాడైతే నాకు సీటు దొరికి ఉండేది కదా అనిపించింది. కంపార్ట్‌మెంట్‌లో చాలామంది తిరుపతి వెళ్లే ప్రయాణికులే— మాసిన గెడ్డాలతో, తలలతో, పసుపుబట్టల్లో. అటు ఇటు కదల వీల్లేకుండా ఉంది. అడకత్తెరలో పోకలా ఉన్నాను. కూర్చునే కునికిపాట్లు పడుతున్న లావుపాటాయనకి పైన తిరుగుతున్న పంకా గాలి అంతా చాలటం లేదు. ఒకటే చెమట. అక్కడక్కడా కొన్ని వెలుగుతూ, కొన్ని వెలగలేక ఉన్న లైట్లు.

నందలూరు వచ్చేటప్పటికి అర్ధరాత్రి దాటింది. ఎవర్నీ ఎక్కనివ్వ లేదు. కొంతమంది దిగారు. ఎక్కడి వాళ్లక్కడే సర్దుకున్నారు — పెట్టెలమీద, కింద కొందరు కూర్చుని, కొందరు పడుకుని. కొందరేమో నిద్రపోతున్నవాళ్లని లేపి, కూర్చుని ఉన్నవాళ్లను మంచి చేసుకొని మొత్తానికి అంతా సర్దుకున్నారు. కింద కూర్చోవటానికి మనస్కరించలేదు నాకు. లావుపాటాయనకి పక్కన ఏమి జరుగుతున్నది తెలియకుండా, గుర్రు పెట్టి నిద్ర పోతున్నాడు— కూర్చునే. కుంభకర్ణుడి అన్నలా ఉన్నాడు! కొట్టి లేపి కూర్చుందా మనికూడా అనిపించింది. అసలే ఎండాకాలం రాత్రులు. ఒకటే దప్పిక. కాళ్లు పీకుతున్నాయి. రాజంపేట స్టేషన్ వచ్చింది కానీ, ఎక్కడా సోడాకానీ, నీటివాసన కానీ లేదు. ఎవరో ఒకామె పిల్లాడికి నీళ్లిస్తూంటే అడిగాను. నా కామె ఇచ్చే గ్లాసునీళ్లకి చెంబునీళ్లు వడ్డీగా స్టేషన్‌లోకి పోయి తేవాలట —నిద్రపోతున్న, కూర్చున్నవాళ్లని తొక్కుకుని, తోసుకుని, ఎక్కడున్నాయో తెలియని దూరానికి పోయి. పైగా ఈ స్టేషన్‌లో కాసేపే ఆగుతుంది మెయిలు. దప్పికకు ఓర్పు నేర్పాను.

కంపార్ట్‌మెంట్‌లో అంతా శవాలల్లే పడి ఉన్నారు. నిశ్శబ్దాన్ని భంగం చేస్తున్నది రైలు కదలిక, పంకా

విసురు మాత్రమే. లావుపాటాయన అప్పుడప్పుడు ముందుకు తూలుతున్నాడు నిద్రలో. మళ్లీ సర్దుకొని కూర్చుంటున్నాడు. కానీ ఇవేవీ అతని అదీనంలో లేనట్లే ఉంది. ఆయన్ను చూసి నవ్వుకుంటున్న నా పెదవులు విడివడి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాయి. ఆయన జేబులో వందరూపాయల నోటు! బాగా పైకి వచ్చి తొంగి చూస్తూంది — పెళ్లిచూపులకి ముందు తలుపు చాటునుంచి తొంగిచూస్తున్నకన్నెలాగు. కన్నెపిల్లలోని ఆకర్షణ కనుపించింది నా కా నోటులో. తీసెయ్యటం చాలా సులువు. రెండు వేళ్లు చాలు! వంద! ఎన్ని రోజులు జల్సా! ! తిరుపతినుండి అట్టే బెంగుళూరుకూడా కొట్టెయ్యొచ్చు. ఎట్లాగూ— ఎన్నో రోజులనుండి గుర్రప్పందాల గురించి విని, చదివి, ఆశ మిన్నేరై పొంగుతూంది మనసులో. ఇదే అదను. వెంటనే నా మనసు పరుగెత్తే గుర్రాల్ని, పచ్చనోట్లని, కార్లని, అందమైన అమ్మాయిల్ని టెక్నీ కలర్ చిత్రంగా తీసి చూసుకుంది. పరీక్షల్లో ఫెయిలయినవాళ్లు జీవితంలో పాసవుతూ వచ్చారు. జీవితంలో పాసు కావటాని కిదే మొదటి మెట్టు. విన్నాళ్లిలా ఉద్యోగం లేని, కూటికి గడవని జీవితం? ఆ టెక్నికలర్ చిత్రం మళ్లీ మళ్లీ కనులముందు అందంగా ఆడింది. అటు ఇటు చూశాను. మెదడులో ఆజ్ఞ ఇంకా ప్లై పవుతూండగానే, చేతి వేళ్లు చల్లగా చేయవలసిన పని చేశాయి — ఆర్డర్సు రాకముందే ఉద్యోగంలో చేరవచ్చిన మినిష్టరల్లుడిలా. లావుపాటాయన వంద రూపాయల నోటు నా స్లాక్ జేబులో చోటు చేసుకుంది. ఏదో కొంత రిలీఫ్, కొంత బాధ ఫీలయ్యాను.

కోడూరు వచ్చింది. పండ్లబుట్టల్ని, మనుషుల్ని ఎక్కించుకొని రైలు బయలుదేరింది. అక్కడే దిగాలని తోచింది. కానీ, ఎటూ నేను దిగవలసింది రేణిగుంట. ఈలోగా లావుపాటాయన మేల్కొడనే ధైర్యం. ఇంక ఒక్క నలభై అయిదు నిమిషాలు!

లావుపాటాయన మేలుకున్నాడు. గుండె గతుక్కుమంది! కాళ్లు లాగటం ఎక్కువైంది. దప్పిక పెరిగింది. కిందయినా కూలబడదా మనిపించింది. ఇంతలో లావుపాటాయన, నా వైపు తిరిగి, "ఇంకా నిలబడి ఉన్నావా? కూర్చో, నాయనా!" అంటూ తన లావుపాటి శరీరాన్ని కుదించి, కొంచెం పక్కకు జరిగి నాకు చోటిచ్చాడు. అంతసేపు సీటు కోసం ఆరాటపడ్డ నేను వెంటనే ఆయన పక్కన కూర్చోలేకపోయాను. శత్రువు నాదరించిన మిత్రత్వ మున్న దా మాటల్లో. చంపబడ్డవాడు హంతకునికి ప్రాణదానం చేయాలన్న ఆరాటపు చూపు ఉంది. అపకారికి ఉపకారం చేసే గొప్ప మనసుంది. దొంగకు వస్తువులు తీసి ఇచ్చే అమాయకత ఉంది. అన్నిటినిమించి పితృ వాత్సల్యముంది. నేను కూర్చోలేను. దొంగ దొంగగా ఆయన వైపు చూశాను. కంపార్ట్‌మెంట్‌లో ఇన్ని పదులమంది జనం ఉన్నారు. ఎవరి సుఖం వాళ్లు చూసుకున్నారు. ఒక్కరైనా, "ఇక్కడ కూర్చో, నాయనా" అన్న వా రున్నారా? ఒకవేళ ఈయన నిద్ర నటించి, నా దొంగతనాన్ని పసిగట్టలేదు కదా అని భయపడ్డాను. దిగిపోదామన్నా రేణిగుంట దాకా ఏ స్టేషన్‌లోనూ ఆగదు రైలు. "కూర్చో, నాయనా,

**చేసిన తప్పు పనికి శిక్ష పడడం న్యాయం. తప్పు చేసినవాడు సైతం శిక్ష అనుభవించాలని కోరడం అరుదే అయినా అసంభవం మాత్రం కాదు. కాని చేసిన నేరానికి శిక్షపడక దానిని సరిదిద్దుకొన్నందుకే శిక్ష అనుభవించ వలసివస్తే?**

ఫర్వాలేదు" అంటూ నా చేయి పట్టుకు కూర్చో పెట్టుకున్నాడు.

చేతి సంచిలోని అరటిపళ్ళ గెల తీసి రెండు నా కిచ్చాడు. తీసుకోవడానికి వెనకాడాను. లోపలేమో తీసుకోవాలని ఉంది— కడుపులో ఒకటే ఎలుకల సందడి. ఆఖరికి నా చేతుల్లోనే పెట్టాడు. తప్పించుకో లేకపోయాను. ఆయన మొదలుపెట్టిన తరవాత నేనూ తిన్నాను. వాటర్ బాటిల్‌నే పైకెత్తి గుటగుట నీళ్లు తాగాడు. "నీళ్లు కావాలా?" అని అడిగాడు. "ఊఁ" అని తల ఊపాను. గ్లాసులో పోసి ఇచ్చాడు. నీళ్లను చూస్తూనే ప్రాణం లేచి వచ్చింది. గొంతు గుండా నీళ్లు పోతూంటే ఎంతో చల్లగా, హాయిగా ఉంది. అమృత మిచ్చి ప్రాణం కాపాడినట్లయింది. గుండె అంతా చల్లబడింది.

ఆయన మంచితనం సూదిమందులా నా రక్తనాళాల్లోకి ప్రవేశించి, కణకణమందు క్రితం క్షణం వరకు నిండి ఉండిన చెడును హరించేసింది.

ఇంత మంచివాడి డబ్బు కొట్టెయ్యటం నాకు అన్యాయంగా తోచింది. పాలు తాగిన రొమ్మునే గుద్దిన ట్లనిపించింది. అతని పక్క వేరస్థుడిలా కూర్చుండిపోయాను. స్లాక్ జేబులోని వంద రూపాయల నోటు కొండంత బరువై నా గుండెని నొక్కేస్తూంది. నా చదువు, ఊరు, సంసార విషయాలు వగైరా అన్నీ ఆప్యాయంగా, ఆత్మీయంగా తండ్రివలె అడిగి తెలుసుకుంటున్నాడు. కొండ కరిగి నన్ను ముంచేస్తున్న ట్లున్నది. ఆయన మంచితనం నన్ను ముంచేస్తూంది. జేబులో ఆ నూరు రూపాయల నోటుతో ఆయన పక్కన నేను బతకలేను. ఊపిరి సరిగా ఆడటం లేదు. ఆ నోటును ఆయన జేబులో చేరిస్తేనే మళ్లీ నాకు ఊపిరాడేది. బ్రతికేది. ఎలా?! ఎలా?!

మాట్లాడుతూ, మాట్లాడుతూనే ఆయన పెద్దగా ఆవలించి చిటికె వేశాడు. నాలో ఆశారేఖ మెరిసింది. మెల్లగా గుర్రులోకి అడుగు పెట్టాడు. ప్రస్తుతం నే నొక్కణ్ణే మేల్కొని ఉన్నాను. సమయం చూసి స్లాక్ జేబులోని నోటు తీసి చూపుడు, మధ్యవేళ్ల మధ్య ఉంచి మెల్లగా లావుపాటాయన జేబులో పెట్టబోతున్నప్పుడు, నా మనసునుండి కొండంత బరువును దించేసినట్లు, నీటిలో ఊపిరాడక కొట్టుకుంటున్న వాణ్ణి గట్టున చేర్చినట్లు ఫీలయ్యాను.

ఆ క్షణంలో సత్కార్యం చేస్తున్న వాడిలో మెరిసిన వెలుగు నా కళ్లలో ఉంది. ఊపిరిలో గర్వముంది. కాని వీట న్నిటినీ బద్దలు చేస్తూ ఎదుటి బల్లమీద కూర్చున్న వ్యక్తి, ఎప్పుడు లేచి పసికట్టాడో ఇదంతా, "దొంగ, దొంగ!" అని అరిచాడు. అప్పటికి వేళ్ల సందులో నోటున్న నా చేయి లావుపాటాయన జేబులో ఉన్నది. అంతకంటే సాక్ష్యం అవసరం లేదు. 'కాట్ రెడ్‌హేండెడ్!' నన్నెవరో బలంగా అగాధంలోకి తోసిన ట్లనిపించింది. అరుపుకు లావుపాటాయన, చుట్టుపక్కల వాళ్లంతా మేలుకున్నారు.

"ఎర్రలాగున్నాడు, దొంగవెధవ" అన్నారు కొందరు.

"బాగుపడవలసిన వయసులో ఇదేం బుద్ధి! తన్నండి" అన్నారు ఇంకొందరు.

అందరూ నన్ను 'దొంగ' అన్నారు.

నే నేమీ మాట్లాడలేకపోయాను. నే చేసిందంతా నిజంగా చెప్పి ఎవర్ని నమ్మించగలను? అంతా నవ్వుతారు తప్ప. విఫల ప్రయత్నంతో నవ్వులపాలు కావటం నా కిష్టం లేదు. కాసేపు లావుపాటాయన నా వైపు నమ్మలేనట్లు చూసి, ఏమీ మాట్లాడలేదు.

ఎందరు ఏమన్నా, కొట్టినా, నా కో సంతృప్తి మిగిలింది. ఆ నోటు ఆయన జేబు చేరింది. నా బరువు తీరింది. నాకు ఇంకేమైనా ఫర్వాలే దనిపించింది.

"కుర్రాడు అలా అనిపించటం లేదు. వదిలేయండి" అన్నాడు లావుపాటాయన.

"మీరు భలేవారండీ. ఇలాంటివాళ్లకే మీ మంచితనం ప్రోత్సాహమిచ్చి చెడగొడుతోంది." ఆయన మంచితనమే దేశంలోని దొంగలందర్నీ ఉత్పత్తి చేసినట్లు ఒకరి గొంతు.

"చదువుకున్న కుర్రాడు కూడాను. అలా చేసి ఉండడు. . . అందునా నా వందా నాకు దక్కింది కదా? వదిలేయండి." బ్రతిమాలేధోరణిలో అన్నాడు లావుపాటాయన.

"వదిలేది లేదు. ఇంకెంత మందిది కొట్టేశాడో! పోలీసోళ్లు తేల్చాల్సిన విషయం. రేణిగుంట స్టేషన్ పోలీసులకు అప్పజెప్పవలసిందే." ఖచ్చితంగా చెప్పాడు ఇందాక 'దొంగ' అని అరిచినాయన, ఆయన కేదో బహుమానం దక్కబోతుందన్నంత సంతోషంగా, పట్టుదలగా.

రేణిగుంట స్టేషన్ వచ్చింది. స్టేషన్‌కు కదల మన్నారు. మౌనంగా అడుగులు వేశాను-లావుపాటాయన వైపు చూస్తూ. పాలు తాగుతున్న దూడను తన నుండి లాక్కు వెళుతున్నప్పుడు చూసే ఆవులాగా లావుపాటాయన నన్ను చూస్తున్నాడు.

పోలీసులు తమ ఆధీనం లోకి తీసుకున్నారు. లావుపాటాయన, మిగతా ప్రయాణికులు తగు సమాచారాన్ని, సాక్ష్యాన్ని ఇచ్చి కదులుతున్న రైలు ఎక్కి వెళ్లిపోయారు. నేను ఏదీ 'కాద'నటం లేదు కాబట్టి కేసు సులభమయింది.

వీళ్ళు నన్ను దేనికి శిక్షిస్తున్నట్లు? మొదట నేను చేసిన, వాళ్లు చూడని దొంగతనానికా? రెండోసారి వాళ్లు చూసిన, నేను చేయని దొంగతనానికా? మంచి పనికా? ★

కేతు బుచ్చిరెడ్డి